క్లుప్తంగా

తహసీల్దార్‌కు అవార్డు



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి

దేవరపల్లి: ఓటర్ల నమోదు, ఎన్నికల నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించిన దేవరపల్లి తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మికి జిల్లా ఉత్తమ సేవా అవార్డు దక్కింది. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరంలో శనివారం జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో కలెక్టర్ పి.ప్రశాంతి చేతుల మీదుగా తహసీల్దార్ ఈ అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు.

ఆకుకూరల పంపిణీ

చాగల్లు: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీడీవో ఆర్.శ్రీదేవి సూచించారు. మండలంలోని మీనానగరం అంగన్ వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు శనివారం పలు రకాల ఆకు కూరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పీవీ పద్మావతి మాట్లాడుతూ ప్రతిఒక్కరు తమ ఇంటి పెరట్లో కూరగాయలు సాగు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందన్నారు. పురుగు మందులు, ఎరువులు వాడకుండా సహజంగా పండించిన ఆకు కూరలు, కూరగాయలు తినడం ద్వారా అనేక రకాల వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు.

వరకట్నం వేధింపులపై కేసు

నిడదవోలు రూరల్: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు శనివారం తెలిపారు. నిడదవోలు మండలం ఉనకరమిల్లి గ్రామానికి చెందిన బోడపాటి కుమారికి పోలవరానికి చెందిన రవికుమార్‌కు 14 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇటీవల కట్నం కోసం తన భర్త రవికుమార్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు మరో ఐదుగురు వేధిస్తున్నారని బాధితురాలు కుమారి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నేడు గణతంత్ర వేడుకలు

దేవరపల్లి: రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత ఆధ్వర్యాన యర్నగూడెంలోని పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం గణతంత్ర వేడుకలు నిర్వహిస్తున్నారు. ఉదయం 9.30 గంటలకు వనిత జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని నేతలు కోరారు.

ఘనంగా గంగాలమ్మ ఊరేగింపు

ఉండ్రాజవరం: తాడిపర్రులో రజక సేవా సంఘం ఆధ్వర్యంలో గంగాలమ్మ జాతర ఊరేగింపు శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం పూజలు చేశారు. అమ్మవారి గ్రామోత్సవంలో అసాదులు నృత్యాలు, శక్తివేషాలు, డప్పు వాయిద్యాలు అందరిని అలరించాయి. అనంతరం తీర్థ ప్రసాదాలు వితరణ చేసారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలంటూ ధర్నా

కొవ్వూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు పూర్తయినప్పటికీ ఇంత వరకు ఇచ్చిన అమలు హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో–ఆర్డినేటర్ ఎండీ ఫాసీ ఉల్లా బేగ్ ఆరోపించారు. సూపర్‌సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలని నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎండీ రఫీ ఉల్లాబేగ్, పీసీసీ వైస్ ప్రెసిడెంట్ మార్టిన్ లూథర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బచ్చు బుజ్జిబాబు పాల్గొన్నారు.

ఫార్మర్ ఫ్రెండ్లీషూ ప్రాజెక్టుకు అవార్డు



స్పెషల్ జ్యూరీ బహుమతి సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కంబాలచెరువు: పుదుచ్చేరిలో ఈ నెల 21 నుంచి 25 వరకూ నిర్వహించిన సదరన్ ఇండియా సైన్స్ ఫేర్ 2025లో జిల్లాకు చెందిన «ఫార్మర్స్ ఫ్రెండ్లీ షూ» అనే ప్రాజెక్టు సదరన్ ఇండియా స్థాయిలో స్పెషల్ జ్యూరీ బహుమతి సాధించిందని జిల్లా సైన్స్ అధికారి జి.నెహ్రూ తెలిపారు. గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు జి.గీతాసౌమ్య, ఎస్.జ్యోత్స్న రూపొందించిన ఈ ప్రాజెక్టుకు గైడ్ టీచర్లగా వి.దుర్గా ప్రసాద్, కె.శ్రీనివాసరావు వ్యవహరించారు. జాతీయస్థాయిలో మన జిల్లా సైన్స్ ప్రాజెక్టుకు ప్రత్యేక బహుమతి రావడంపై జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కంది వాసుదేవ రావు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి, డీవైఈవో ఈవీబీఎన్ నారాయణ హర్ష వ్యక్తం చేశారు.

నిరుపయోగంగా లేసు భవనాలు



కానూరులో నిరుపయోగంగా ఉన్న లేసు భవనం



అన్నవరప్పాడులో పరిస్థితి ఇలా..

- మహిళలకు కానరాని ఉపాధి
- అధికారుల నిర్లక్ష్యంతో అలంకారప్రాయం

పెరవలి: అధికారుల నిర్లక్ష్యమో, పాలకుల అలక్ష్యమో కానీ, గ్రామీణ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే ధ్యేయంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. భవనాలు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా, నేటికీ ప్రారంభోత్సవం చేయకుండా వదిలివేయడంతో, భవనం అంతా చెత్తాచెదారంతో నిండిపోయింది. నిడదవోలు నియోజకవర్గంలో ఆరు భవనాలుండగా, వీటిలో ఉండ్రాజవరం మండలంలోని రెండు భవనాలను ఇతర కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. పెరవలి మండలంలో అన్నవరప్పాడు, కానూరు, ఖండవల్లి గ్రామాల్లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో రూ.35 లక్షలతో నిర్మించిన లేసు పార్కు భవనాలు నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉన్నాయి. గ్రామీణ మహిళలు కుట్లు, అల్లికలతో తయారయ్యే వివిధ వస్తువులను రూపొందించి, ఎగుమతులు చేయడం కోసం ఈ భవనాలు నిర్మించారు. వీటి వలన ఉత్పత్తులకు డిమాండ్ పెరిగి వందలాది మహిళలకు ఉపాధి దొరుకుతుందనే ఉద్దేశంతో, ఇక్కడ భవనాలు ఏర్పాటుచేయడం బాగానే ఉన్నా, దానిని అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వల్ల అది నెరవేరకుండా పోయింది. పదేళ్లుగా ఈ భవనాలు నిరుపయోగంగానే ఉండటంతో అలంకారప్రాయంగా మారాయి. ఎన్నో ప్రభుత్వ శాఖలకు సొంత భవనాలు లేక, అద్దె భవనాల్లో మగ్గుతుంటే.. మహిళలకు ఉపాధి కల్పించడం కోసం నిర్మించిన భవనాలు అక్కడరకు రాకుండా పడిఉండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్డీవోకు ఉత్తమ సేవా పురస్కారం



విజయవాడలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు: యువ ఓటర్ల నమోదులో ఉత్తమ పనితీరు కనబరిచిన కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మితకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితా రూపకల్పనలో ఉత్తమ పనితీరు కనబరిచిన 11 మంది ఆర్డీవోలను అవార్డులకు ఎంపిక చేశారు. కొవ్వూరు డివిజన్‌లో 18 నుంచి 19 ఏళ్ల వయసు కలిగిన యువ ఓటర్లును 98 శాతానికి పైగా నమోదు చేయడంతో ఆర్డీవో ఉత్తమ సేవా అవార్డుకు ఎంపికయ్యారు. కాగా శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయనంద్ చేతుల మీదుగా ఆర్డీవో ఈ అవార్డును అందుకున్నారు. తహసీల్దార్ ఎం.దుర్గా ప్రసాద్, ఏఈఆర్‌వో అవార్డులు దక్కించుకున్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, ఇతర అధికారులు ఆర్డీవో సుస్మితను అభినందించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



వేలివెన్ను ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంచాల పంపిణీ చేస్తున్న దృశ్యం.

ఉండ్రాజవరం: విద్యార్థులు కష్టపడి చదివి, ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి, పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని వేలివెన్ను ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బలభద్ర భాస్కర గుప్త అన్నారు. వేలివెన్ను ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేయడానికి సుమారు రూ.30 వేలు వ్యయంతో 300 కంచాలను విద్యార్థులకు శనివారం అందజేశారు. ఈ కంచాలను అందజేసిన వేలివెన్ను గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భాస్కర గుప్తాను పాఠశాల హెచ్‌ఎం కేఎల్ గణేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

100 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ



కొవ్వూరులో 100 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



కొవ్వూరు విజయవిహార్ సెంటర్‌లో పిరమిడ్ ఆకారంలో విద్యార్థులు చేస్తున్న విన్యాసాలు

కొవ్వూరు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూల్ విద్యార్థులు శనివారం 100 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. స్కూల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ మెయిన్ రోడ్డులో విజయ విహార్ సెంటర్, బస్టాండ్ సెంటర్ మీదుగా సాగింది. ప్రజల్లో జాతీయ భావం పెంపొందించాలన్న సంకల్పంతో ఈ భారీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించినట్టు పాఠశాల కరస్పాండెంట్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర తెలిపారు. గణతంత్ర దినోత్సవం, రాజ్యాంగం ప్రాముఖ్యతను చాటి చెప్పేందుకు ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. ప్రధాన జంక్షన్‌లో విద్యార్థులు చేసిన ప్రదర్శనలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. పిరమిడ్ ఆకారంలో విద్యార్థులు విన్యాసాలు చేశారు. పాఠశాల డైరెక్టర్ అక్షయపాత్ర రస్మిత, డాక్టర్ ఉపేంద్రనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుకతో ట్రాక్టర్ సీజ్

నిడదవోలు రూరల్: విజ్జేశ్వరంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు శనివారం తెలిపారు. విజ్జేశ్వరం వద్ద అక్రమంగా ఇసుకను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తుండగా వచ్చిన సమాచారం మేరకు వీఆర్వో వీఎస్‌వీఎస్ఆర్ అచార్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేస్తునట్టు ఆయన పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం

తాళ్లపూడి: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై టి.రామకృష్ణ శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... తాళ్లపూడి గ్రామానికి చెందిన బొమ్మాళి వైష్ణవి అదే గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు త్రినాథ్, బబ్లీ పోలీసుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

ముప్పవరంలో పశువైద్య శిబిరం

చాగల్లు: మండలంలోని ఎస్.ముప్పవరంలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి డాక్టర్ యు.రాజేష్ పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 150 పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు నట్టల నివారణ మందులు అందజేశారు. లంపి చర్మ వ్యాధి, గొంతువాపు వ్యాధి, కొక్కెర వ్యాధులకు నివారణ టీకాలు వేశారు. పశువులకు బాహ్య పరాన్న జీవుల నిర్మూలన, గర్భకోశ వ్యాధుల చికిత్సలు, చూడు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశు సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ అక్షరాస్యతే ఉల్లాస్ లక్ష్యం

పెరవలి: ఆర్థిక, డిజిటల్, క్రియాత్మక అక్షరాస్యతను సాధిచడమే ఉల్లాస్ కార్యక్రమం లక్ష్యమని ఇన్‌చార్జి ఎంపీడీఓ సీహెచ్ వెంకట రమణ తెలిపారు. పెరవలి వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ రెండో విడత శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కేరళ తరహాలో నూటికి నూరుశాతం అక్షరాస్యత సాధించలనే లక్ష్యంతో వయోజన విద్య కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఉల్లాస్ చేపట్టబోతారన్నారు. ఏపీఎం బి.రామకృష్ణ మాట్లాడుతూ పెరవలి మండలంలో 700 మంది నిరక్ష్యరాసులు ఉన్నారని వీరందరినీ అక్షరాసులుగా తీర్చిదిద్దితే నూరుశాతం సాధించినట్టు అవుతుందన్నారు. అక్షరాస్యతతో పాటు ఆర్థిక నిర్వహణ సక్రమంగా చేయడం, డిజిటల్‌లో శిక్షణ ఇవ్వడంతో ఆర్థిక వనరులను వారి ఖాతాలకు మళ్లించుకోవడం, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు వంటి వాటి పై తర్ఫీదు ఇస్తారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు కనకదుర్గ, అకౌంటెంట్ మహాలక్ష్మి, శిక్షకులు, అభ్యాసకులు పాల్గొన్నారు.

మార్చి 8న మెగా లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి అనురాధ

కొవ్వూరు: రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకునేందుకు మార్చి 8న కొవ్వూరులో నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎం.అనురాధ సూచించారు. శనివారం కోర్టు హాలులో న్యాయ వాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు న్యాయవాదులు కృషి చేయాలని కోరారు. సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతీ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయి కృష్ణ, రెండో అదనపు మేజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతిరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న న్యాయమూర్తి

కొవ్వూరు: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎం.అనురాధ తెలిపారు. న్యాయవాదులు, గుమస్తాలు, కోర్టు సిబ్బందికి డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు రోగులకు వైద్య సేవలు అందించారు. సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతీ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ, సెకండ్ అడిషనల్ అండ్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతిరావు, న్యాయవాదులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

మహా కుంభమేళాకు బస్సు సదుపాయం

నిడదవోలు : స్థానిక ఆర్టీసీ డిపో నుంచి వచ్చే నెల నాలుగో తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు మహా కుంభమేళాకు సూపర్ లగ్జరీ వీడియో కోచ్ బస్సు నడుపుతున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు రోజుల టూర్‌లో భువనేశ్వర్, పూరి, కోనార్క్ ప్రయాగరాజ్, కుంభమేళా, వారణాసి, గయ, బుద్ధగయ, అనసవిల్లి, శ్రీకూర్మం, త్రివేణి సంగమం వంటి ఆధ్యాత్మిక ప్రాంతాల్లో పర్యటించి తిరిగి నిడదవోలుకు బస్సు చేరుకుంటుంది. ప్రయాగరాజ్, కాశి క్షేత్రాల్లో ఒక రోజు బస చేయాల్సి ఉంటుంది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారంతో కలిపి మనిషికి టికెట్ ధర రూ.10,000 వేలు మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక యాప్ ద్వారా ప్రయాణికులు ఎక్కడ ఉన్నా బస్సు దగ్గరకు చేరుకునే సదుపాయం కల్పించామన్నారు. వివరాల కోసం 98499 73130, 91009 54632 నంబర్లను సంప్రదించాలని డీఎం తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు కీలకం



ఓటరు దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేస్తున్న నల్లజర్ల ఎస్ఆర్‌కే కళాశాల విద్యార్థులు



గోపాలపురం జెడ్పీ హైస్కూల్‌లో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న తహసీల్దార్



ఉండ్రాజవరంలో ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్, తదితరులు



దేవరపల్లిలో ఓటర్ల దినోత్సవం ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థుల మానవహారం

- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- సీనియర్ సిటిజన్లకు సత్కారం

నల్లజర్ల: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు అన్నారు. ఓటరు దినోత్సవం సందర్భంగా నల్లజర్ల ఎస్ఆర్‌కే కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను, బీఎల్‌వోలను, సూపర్ వైజర్లను సత్కరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శాంతిప్రియ, ఆర్ఐ శాస్త్రి, వీఆర్వో చంద్రబాబు, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.అజయ్‌కుమార్, ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. అలాగే తెలికిచెర్ల, జగన్నాథపురం గ్రామ పంచాయతీల్లో ఓటరు దినోత్సవం నిర్వహించారు.

దేవరపల్లి: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యాన దేవరపల్లిలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ ప్రధాన పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ ఓటర్లను సన్మానించారు. కొత్తగా ఓటు హక్కు పొందిన యువతీ యువకులకు ఫొటో ఓటరు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిట్టా రవికిషోర్, బీఎల్‌ఓలు, వీఆర్‌ఓలు, డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు విలువ ప్రతిఒక్కరూ తెలుసుకోవాలి

ఉండ్రాజవరం: ప్రజాస్వామ్యం వ్యవస్థలో ఓటు విలువను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్ అన్నారు. మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో శనివారం ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో బూత్ లెవల్ అధికారులు, రెవెన్యూ, విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, గ్రామస్తుల సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ 18ఏల్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. బూత్ లెవల్ అధికారులలో ఎలక్షన్ వర్కులో ప్రావీణ్యం చూపించిన వారికి బెస్ట్ బీఎల్‌వో అవార్డ్‌లను అందుజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు తప్పకుండా వినియోగించుకోవాలి

గోపాలపురం: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.అజయ్‌బాబు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూలులో శనివారం నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఓటును అమ్ముకోవడం మానుకోవాలని కోరారు. అనంతరం సీనియర్ ఓటర్లను సత్కరించారు. వైఎస్సార్ జంక్షన్‌లో విద్యార్థులు మానవహారం నిర్వహించి, ఓటు విలువ తెలియజేశారు. ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, హెచ్ఎం కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజ్యాంగం కల్పించిన ఆయుధం ఓటు

నిడదవోలు రూరల్: ప్రజలకు రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధం ఓటు అని, ఆ హక్కును నిజాయితీగా వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య విలువను కాపాడాలని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు కోరారు. మండలంలోని సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయం వద్ద సీనియర్ ఓటర్లను శనివారం ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ, బీఎల్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలు : స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు తహసీల్దారు బి.నాగరాజు నాయక్ ఆధ్వర్యంలో శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జాతీయ ఓటర్ల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల, అధ్యాపకులు, రెవెన్యూ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులు మానవహారం నిర్వహించారు. విద్యార్థులతో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. ఐదుగురు సీనియర్ సిటిజన్లను సత్కరించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ రుద్ర, టౌన్ ప్లానింగ్ అధికారి ఎస్.సుప్రియ, పట్టణ ఎస్సై పి.శోభన్‌కుమార్, ఎలక్షన్ సూపర్‌వైజర్, అధ్యాపకులు, బీఎవ్వోలు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలు : బీజేపీ ఆధ్వర్యంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు చామంతి భీమేశ్వరరావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోర్త బాలవినోద్ సాయి కుమార్, మానూరి కిషోర్, మదునూరు వెంకట కిషోర్ రాజు, కోడే చిట్టిబాబు, జీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ

నల్లజర్ల: దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేద మహిళల ఆర్థికాభివృద్ధిని పెంచే దిశగా తమ సంస్థ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు లివింగ్ శాక్రిఫైస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ దేవ సహాయం తెలిపారు. సుభద్రపాలెంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో శనివారం 12 మంది మహిళలకు కుట్టు మెషీన్లు, శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు. వీరందరికీ ఆరు నెలల పాటు కుట్టు శిక్షణ అనంతరం మెషీన్లు అందజేసినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పోతవరం ఉప సర్పంచ్ యేలేటి సత్యనారాయణ (జేడీ), బొర్రా వీర వెంకట సత్యనారాయణ, సంస్థ కార్యదర్శి ప్రేమ దేవ సహాయం, మాజీ సర్పంచ్ గంద్రకోట శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రవికుమార్, భీమడోలు శాంసన్, అల్లూరి రాజేష్, పెనుమాక ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పంపకంలో అన్యాయం జరిగిందంటూ ఆందోళన

నల్లజర్ల: ఉమ్మడి ఆస్తి పంపకం విషయంలో తన భర్తకు అన్యాయం జరిగిందంటూ అత్తవారింటి ముందు ఓ మహిళ శనివారం నిరాహార దీక్ష చేపట్టింది. వివరాల్లోకి వెళితే.. నల్లజర్ల గ్రామానికి చెందిన చుండ్రు పాపారావుకు ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. పిల్లలందరికీ వివాహాలు జరిగాయి. అయితే ఆస్తి పంపకాల విషయంలో తమకు అన్యాయం జరిగిందంటూ పెద్ద కుమారుడి భార్య భారతి ఆందోళన చేపట్టింది. తమకు రావాల్సిన ఆస్తిని మావగారు ఇతరులకు రాశారని ఆరోపించింది. ఈ విషయంలో అధికారులు జోక్యం చేసుకుని, తనకు న్యాయం చేయాలంటూ మావగారి ఇంటి ముందు శిబిరం వేసుకుని దీక్షకు దిగింది. ఈ విషయం తెలుసుకున్న నల్లజర్ల ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్‌కేఎస్ నాయుడు, ఎస్ఐ బాలాజీ, వీఆర్వో చంద్రబాబు ఆ ప్రాంతానికి వెళ్లి ఆందోళన చేస్తున్న భారతితో మాట్లాడారు. ఈ విధంగా ఆందోళన చేయడం సబబు కాదని, ఏదైనా ఉంటే కోర్టును ఆశ్రయించి న్యాయం పొందాలని సూచించారు. గ్రామపెద్దలు, అధికారుల సూచన మేరకు ఆమె ఆందోళన విరమించింది.